ఏజెన్సీలో లెప్రసీ సర్వే

- ఈ నెలాఖరు వరకు వివరాల సేకరణ
- ఏఎన్‌ఎం, వైద్యాధికారుల పర్యవేక్షణ



భద్రాచలంలో సర్వే చేస్తున్న ఆశా కార్యకర్త

భద్రాచలంఅర్బన్: లెప్రసీ(కుష్ఠు) వ్యాధిని ముందుగా గుర్తించి, సరైన వైద్యం అందించడానికి వీలుగా ఈ నెల 17 అనగా సోమవారం నుంచి వైద్య ఆరోగ్య అధికారులు సర్వే మొదలు పెట్టారు. కాగా ఈ సర్వే 31న ముగియనుంది. ఈ సర్వే కోసం ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలను వినియోగించనున్నారు. రెండు నెలల క్రితమే జిల్లాలో సర్వే నిర్వహించగా అప్పుడు ఆశవర్కర్లు సమ్మెలో ఉండటంతో అసంపూర్తిగా మూలన పడింది. దీంతో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించేందుకు అధికారులు మళ్లీ ప్రణాళిక రచించారు. దీన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేసి లెప్రసీ గణాంకాలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా లెప్రసీ నివారణ అధికారి డా.బాలాజీ నాయక్ పర్యవేక్షణలో సిబ్బందికి శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించారు.

ఒక్కొక్కరికి 25 ఇళ్లు..

భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల పరిధిలో మొత్తం 1.70 లక్షల పైచిలుకు జనాభా ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండల పరిధిలో మొత్తం 187 మంది ఆశ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు రోజుకు 25 ఇళ్లను సందర్శించి సర్వే చేసేలా ప్లాన్ చేశారు. సర్వేను సూపర్ వైజింగ్ చేయించేందుకు ఐదుగురు ఆశా వర్కర్లకు ఒకరు చొప్పున ఏఎన్‌ఎంలను నియమించారు. మొత్తంగా మండల మెడికల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. జిల్లా స్థాయిలో జిల్లా లెప్రసీ అధికారి సర్వేను రోజు వారీగా పరిశీలిస్తారు. వేసవి ఎండలు మండుతున్న నేపథ్యంలో ఉదయం 7 గంటలకే సర్వే ప్రారంభించి 9 వరకు రోజూ రెండు గంటల పాటు నిర్వహిస్తారు. ప్రభుత్వం ఇప్పటికే సర్వే కోసం ప్రత్యేక నిధులు విడుదల చేయగా సర్వేలో పాల్గొన్న వారికి అదనపు పారితోషికం ఇవ్వనున్నారు.

మూడేళ్లుగా అందని పారితోషికం..

ఆశా కార్యకర్తలు గడిచిన మూడేళ్లుగా.. 6 నెలలకు ఒకసారి 14 రోజుల పాటు ఈ లెప్రసి సర్వే చేస్తున్నారు. వీరికి ఒక్కో రోజుకి రూ.75లు చొప్పున ఏడాదికి ఒక్కో ఆశా కార్యకర్తకు రూ.2,100లు చెల్లించాల్సి ఉంది అంటే 187 మంది ఆశా కార్యకర్తలకు రూ. 3లక్షల 92 వేలు వరకు పారితోషికం అందించాల్సి ఉంది. అయితే ఇప్పటికే మూడేళ్ల నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే వారికి ఇస్తామన్న అదనపు పారితోషికం చెల్లించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఆశాలు ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది ఈ కారణంగానే ఓ సర్వేను మేము చేయమని ఆశాలు తేల్చి చెప్పడంతో ఆపేయాల్సి వచ్చింది.

సర్వేకు సహకరించాలి



సర్వేలో లెప్రసీ రోగులను నిర్ధారిస్తారు. వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకి వివరాలు అందజేస్తారు. రోగ నిర్ధారణ తరువాత వారికి పూర్తి స్థాయిలో ప్రభుత్వమే చికిత్స చేయిస్తుంది. ఈ క్రమంలో రోగులను గుర్తించటమే ప్రధాన అంశం. అందుకే సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఇంటికి వచ్చిన ఆరోగ్య సిబ్బందికి అవసరమైన వివరాలు అందజేయాలి.

– డాక్టర్ చైతన్య,
డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, భద్రాచలం

క్షయ వ్యాధి నివారణ దినోత్సవం

ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వైద్యసిబ్బంది పలుచోట్ల కార్యక్రమాలు చేపట్టారు. ఏఎన్‌ఎం, ఆశావర్కర్లతో వైద్యసిబ్బంది వీధుల్లో ర్యాలీలు నిర్వహించి క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. మాట్లాడుతూ.. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తెమడలో రక్తం పడడం తదితర లక్షణాలున్న వారు వెంటనే క్షయ వ్యాధి నివారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ములకలపల్లి: బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన ఉద్యోగులు



అశ్వారావుపేటరూరల్: అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధులిక



దమ్మపేట: పట్వారిగూడెంలో ర్యాలీ చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది



దుమ్ముగూడెం: ర్యాలీ నిర్వహిస్తున్న పర్ణశాల వైద్య సిబ్బంది

క్లుప్తంగా

ఆదివాసీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ప్రజలను పరీక్షిస్తున్న వైద్యులు

చంద్రుగొండ: గొత్తికోయ గూడేలకు వచ్చిపోయో ఆదివాసీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా మలేరియా ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ స్పందన్ ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మద్దుకూరు గ్రామశివారు అటవీ ప్రాంతంలోని మంగళబోడులో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూడేలకు వచ్చిపోయో వారి వివరాలు, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పరీక్షలు చేయాలన్నారు. గర్భిణులను, వ్యాధుల బాధితులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మలేరియా అసిస్టెంట్ జిల్లా అధికారి కుమారస్వామి, డాక్టర్ ప్రియాంక, సిబ్బంది జయలక్ష్మి, ప్రకాష్‌రావు, రామదాసు, భవాని, హారిక, విజయలక్ష్మి, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

మునగ సాగు చేపట్టండి



రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మునగ పంట సాగు విరివిగా చేపట్టాలని ఎంపీడీఓ మహాలక్ష్మి రైతులను కోరారు. మండలంలోని నర్సాపురంలో సోమవారం ఆమె పర్యటించి.. రైతులకు మునగసాగుపై అవగాహన కల్పించారు. మునగ పంట సేద్యంపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రైతులకు వివరించారు.

వాస్తుమిత్ర అవార్డు..



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసాచారి

అశ్వాపురం: వాస్తురంగంలో ప్రఖ్యాతి పొందిన మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన డాక్టర్ పదిరావూరి శ్రీనివాసాచారికి విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ 15వ వైదిక జ్యోతిష్య సమావేశంలో ఉగాది పురస్కారాలను పురస్కరించుకుని వాస్తుమిత్ర అవార్డు అందజేశారు. శాలువాతో సన్మానించారు. గతంలో శ్రీనివాసాచారి అమెరికన్ డాక్టరేట్‌తో పాటు 22 అవార్డులు ఆయన సొంతం చేసుకొని స్వదేశం, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. వాస్తుమిత్ర అవార్డు పొందిన శ్రీనివాసాచారిని మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి,మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, స్థానికులు అభినందించారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

బూర్గంపాడు: మండల ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వేపలగడ్డ ప్రీమియర్ లీగ్ క్రికెట్‌టోర్నీ సోమవారం ముగిసింది. ఈ టోర్నీలో వేపలగడ్డ కోమరం భీం టీమ్ విన్నర్‌గా నిలిచింది. కోయగూడెం మహేష్ టీమ్ రన్నర్‌గా నిలిచారు. విన్నర్, రన్నర్ జట్లకు మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ ట్రోఫీ, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటి ప్రతినిధులు తాటి సత్యనారాయణ, కుంజా చిన్నబ్బాయి, పాయం వెంకటేశ్వర్లు, శెర్పా వెంకటేశ్వర్లు, కుంజా కృష్ణ, తాటి వెంకటేశ్వర్లు, ఎడమ రామారావు, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు ఉపాధి పొంది సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కోరారు. సోమవారం మండల పరిధిలోని మామిళ్లవారి గూడెం, కావడిగుండ్ల, కన్నాయిగూడెం, మల్లాయిగూడెం, ఆసుపాక పంచాయతీల్లో పర్యటించి ఆయా పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మస్టర్లను తనిఖీ చేశారు. అలాగే కూలీలకు పని ప్రదేశాల్లో నీడతోపాటు తాగునీరు సౌకర్యాలను కల్పించడంతోపాటు కూలీల హాజరు సంఖ్యను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీఓ సోయం ప్రసాద్, ఏపీఓ రామచంద్రరావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లతో సమస్యలకు చెక్



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

చర్ల: వేసవిలో ఎటువంటి విద్యుత్ సమస్యలు ఎదురవకుండా ఉండేందుకు చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో అవసరమైన అన్ని చోట్లా ఎక్కువ సామర్థ్యం కలిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీ ఎన్‌పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన చర్లలో పలు చోట్ల ఎదురవుతున్న లోవోల్టేజీ సమస్యను అధిగమించేందుకు ఏర్పాటు చేసిన 100 కేవీఏ, 63 కేవీఏ, 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం ఆయన భద్రాచలం డివిజనల్ ఇంజనీర్ జీవన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అవాంతరాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంపు వంటి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వంటపాత్రల పంపిణీ



భద్రాచలంటౌన్: ఏజెన్సీలకు వంట సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ రమ, తదితరులు

ములకలపల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అందించిన వంట పాత్రలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని 62 ప్రభుత్వ పాఠశాలలకు హెచ్‌సీఏ హైదరాబాద్ అగ్రికల్చరల్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎంఈఓ సత్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం మధ్యాహ్న భోజన వర్కర్లకు పంపిణీ చేశారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం మండలంలోని 11 పాఠశాలలకు పీఎమ్ పోషన్, ఆక లిమిటెడ్ కార్పొరేషన్ ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సోమవారం వంట సామగ్రిని ఎంఈఓ రమ ఏజెన్సీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామగ్రి వివరాలను స్టాక్ రిజిష్టర్‌లో నమోదు చేసుకుని వినియోగించుకోవాలన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీలు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

చర్ల: ఓ మూడేళ్ల బాలుడు పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా.. ఆంధ్రప్రదేశ్ వాసి రూ.లక్ష సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. చర్ల మండలంలోని దానవాయిపేటకు చెందిన కనితి రామకృష్ణ–సోనీల మూడేళ్ల కుమారుడు భువిన్ ఆద్విత్ రాం పుట్టకతోనే పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో డాక్టర్లు ఆపరేషన్ చేయల్సి ఉందని, అందుకు సుమారు రూ.4 లక్షల మేర ఖర్చు అవుతుందని సూచించడంతో కుటుంబ సభ్యులు దాతలను అభ్యర్థిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బ్యూటీఫుల్ లైఫ్ అసోసియోషన్ ప్రతినిధులు డాక్టర్ గాయిత్రి, డాక్టర్ పసుపులేటి ప్రవీణ బాధిత బాలుడిని సందర్శించి వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను పరిశీలించి వారి కాంటాక్ట్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన, ప్రస్తుతం అరబ్ దేశంలోని అబుదాబీలో స్థిరపడిన మీరాకు విషయాన్ని తెలియజేశారు. దీంతో వారు నేరుగా సోమవారం బాధిత బాలుడి తండ్రి ఖాతాలోకి ఆపరేషన్‌కు రూ.లక్షను బదిలీ చేశారు. బాలుడి వైద్య సాయం కోసం ఆర్థిక సాయం అందించిన మీరాకు, బ్యూటీఫుల్ లైఫ్ అసోసియోషన్ ప్రతినిధులకు బాలుడి తండ్రి దండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మొక్కలకు 'హరిత' ఛత్రం!



కొబ్బరితోటలో అంతర పంటగా సాగు చేస్తున్న జాజి మొక్కలు.. వాటికి వేసిన పందిర్లు

అశ్వారావుపేటరూరల్: అంతర పంటగా సాగు చేస్తున్న మొక్కలను భానుడి సెగ నుంచి రక్షించేందుకు ఓ రైతు విభిన్నంగా ఆలోచించాడు. అశ్వారావుపేట మండలం పండువారిగూడెం గ్రామ శివారులో, ఇదే గ్రామానికి చెందిన మూర్తిరాజు అనే రైతు కొబ్బరి తోటను సాగు చేస్తున్నాడు. ఈ తోటలో ఈ ఏడాది అంతర పంటగా జాజి పంటకు శ్రీకారం చుట్టారు.

కాగా, కొద్ది రోజులుగా భానుడి భగభగలతో జాజి మొక్కలు వాడిపోకుండా ఉండేందుకు, వాటిని కాపాడుకునేందుకు మొక్క మొక్కకు వెదురు కర్రలతో పందిరి వేశాడు. వాటిపై గ్రీన్ షిట్‌ను పెట్టడంతో వాటికి హరిత ఛత్రంగా మారాయి. దీంతో మొక్క మొక్కకూ వేసిన ఈ చిన్న, చిన్న పందిర్లు ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలను సోమవారం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జడ్జి

అశ్వాపురం: మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలోని మానవీయ వృద్ధాశ్రమాన్ని బుధవారం మణుగూరు జ్యూడీషియల్ కోర్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కంభపు సూరిరెడ్డి సందర్శించారు. న్యాయమూర్తి ఆశ్రమాన్ని పరిశీలించి వృద్ధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వారికి పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ అంకం సర్వేశ్వరరావు, న్యాయవాదులు రుద్ర వెంకట్, రమేష్‌బాబు, పోశం భాస్కర్, పద్మ, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో టీజీఎస్‌ఆర్టీసీ డిపో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో తాగునీటి చలివేంద్రాన్ని డిపో మేనేజరు తిరుపతి రిబ్బన్ కట్ చేసి సోమవారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు బస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో క్లర్క్ అల్లం నాగేశ్వర్‌రావు, సీఐ గౌతమీ తదితరులు పాల్గొన్నారు.

గణిత డైరీ ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గణిత శాస్త్ర డైరీని టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, జిల్లా బాధ్యులు పద్మ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ రమ మాట్లాడుతూ.. గణిత డైరీ వలన గణిత ఉపాధ్యాయులకు ముఖ్యమైన జీవోలు, ఆరు నుంచి పదో తరగతుల వరకు సూత్రాలు, గణిత ఫ్లో చార్టులు, భారతీయ గణిత శాస్త్రవేత్తల వివరాలు పొందుపరచినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజా శ్రీనివాస్, పవన్ కుమార్, ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ అన్నె సత్యనారయణమూర్తి తన అనుచరగణంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి పొంగులేటి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు పూసం సావిత్రి, పాడియం సుబ్బారావు, కొండపల్లి నరేంద్ర, అల్లాడి వెంకటేష్ తదితర కుటుంబాలు పార్టీలో చేరాయి. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు లంక శ్రీనివాసరావు, పిలక వెంకటరమణ రెడ్డి, మట్ట శివాజీ, కుంజా శ్రీనివాసరావు, కెల్లా శేఖర్, తోట రమేష్, కొమ్ము రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

ఐక్యంగా ఉద్యమిస్తాం..

భద్రాచలంటౌన్: ఆదివాసీల అస్తిత్వాన్ని నీరుగార్చేలా కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నారని, ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు అస్తిత్వాన్ని కాపాడడం కోసం అందరం కలిసి ఐక్యంగా ఉద్యమిస్తామని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక(జేఏసీ)నాయకులు అన్నారు. స్థానిక ఐటీడీఏ ప్రాంగణంలో ఆదివాసీ జేఏసీ నాయకుడు పాయం రవివర్మ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ సీనియర్ నాయకుడు పూనెం వీరభద్రం మాట్లాడారు. ఏజెన్సీలో కొందరు అసలైన ఆదివాసీ తెగలు కోయ, కొండరెడ్డి, నాయకపోడులను విస్మరిస్తూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో హక్కుల సాధన కొరకు పూర్తి స్థాయి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముర్ల రమేష్ రెడ్డి, పూనెం కృష్ణ దొర, నాగేశ్వరరావు, వీసాల కృష్ణయ్య, కల్లూరి జయబాబు, కొండ్రు సుధారాణి, కుంజా రమాదేవి, జగ్గ పుల్లయ్య, చిచ్చడి సత్యనారాయణమూర్తి, కొర్స చిన్నబాబు దొర, ఉమ్మల దుర్గారెడ్డి, రవికుమార్, వాసం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ

మణుగూరురూరల్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ –భద్రాచలం, పుష్పగిరి కంటి ఆస్పత్రి–సికింద్రాబాద్ వారి సహకారంతో జనవరిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించుకున్న పగిడేరు బాధితులకు సోమవారం మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరిండెంటెంట్ డాక్టర్ సునీల్ చేతుల మీదుగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలం దృష్ట్యా ప్రజలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను, నియమాలను వివరించారు. అనంతరం నేత్రవైద్యాధికారి జి.సంజీవరావు మాట్లాడుతూ.. కంటివైద్య శిబిరంలో పలువురికి కంటి వైద్యపరీక్షలు చేయగా.. 30మంది కంటి ఆపరేషన్లు అవసరమని, వారిని ఆపరేషన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు ఉచిత కంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటల్లో బినామీలను అరికట్టాలి

చర్ల: గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివిధ వేలం పాటల్లో కొన్నేళ్లుగా గిరిజనుల ముసుగులో గిరిజనేతరులు ప్రవేశిస్తున్నారని, అటువంటి వారిని నియంత్రించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చర్లలోని పంచాయతీ కార్యదర్శి టి.సురేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏజెన్సీలోని పెసా చట్టం ప్రకారం గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగులైన గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు గ్రామపంచాయతీ వేలం పాటల్లో కేవలం గిరిజనులు మాత్రమే పాల్గొనేలా చట్టం ఉందని, కానీ దానిని అతిక్రమించి గిరిజనేతరులు దొడ్డిదారిన వేలం పాటల్లో చేరి గిరిజనులను ఆర్థికంగా ఎదగనీయకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ సారి వేలం పాటల్లో అలా దొడ్డిదారిన ఎవరైనా వస్తే అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎస్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర నాయకులు ఇర్పా ప్రకాశ్ పాల్గొన్నారు.

పనులు పూర్తి కాకుండానే నీటి విడుదలా?

- సీతారామ ప్రాజెక్ట్‌పై సీపీఎం నాయకులు
- కెనాల్, పంప్‌హౌస్‌ల సందర్శన



అశ్వాపురం: దుమ్ముగూడెం ఆనకట్టను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కాకుండా సీఎం, మంత్రులు ఆర్భాటంగా ఆగమేఘాల మీద నీరు విడుదల చేసి ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చారని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సీపీఎం జిల్లా నాయకత్వ బృందం సోమవారం సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌లు, కెనాల్‌ను పరిశీలించింది. అశ్వాపురం మండల కుమ్మరిగూడెం గ్రామంలో దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి సందర్శన చేపట్టి బీజీకొత్తూరు, ములకలపల్లి మండలం పూసుగూడెం, కమలాపురం, చంద్రుగొండ మండలం ఎర్రగుంట వద్ద పాయింట్, జూలూరుపాడు మండలం వినోభానగర్ వద్ద పాయింట్ వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన పనులు ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు, సాధించిన ఫలితాలపై ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. గోదావరికి గండి కొట్టి కాలువలకు నీటిని విడుదల చేయడం అక్రమం కాదా అని ఆయన ప్రశ్నించారు. జిల్లా భూములకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేయాలని పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ పనులకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు వెంటనే చేయాలని, భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే.రమేష్, జిల్లా నాయకులు యలమంచిలి రవికుమార్, స్వర్గం బాలనర్సయ్య, బ్రహ్మచారి, నర్సారెడ్డి, కారం పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, రాపాకుల శ్రీనివాస్, గద్దల శ్రీనివాసరావు, నిమ్మల వెంకన్న, పాయం భద్రయ్య, నరసింహారావు, సాంబశివరావు, సూర్య చందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ నీళ్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగుభూములకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా బృందం మంగళవారం మండలపరిధిలోని వీకే రామవరం, కమలాపురంలలోని పంప్‌హౌస్–2, 3లను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన కాలువలు మాత్రమే పూర్తి చేసిన నేపథ్యంలో, పంటకాలువలు త్వరిగతిన పూర్తి చేసి, జిల్లా వ్యాప్తంగా సేద్యం చేస్తున్న భూములను నీరు అందించాలని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, కొక్కెరపాటి పుల్లయ్య, బాలా నర్సిరెడ్డి, కే బ్రహ్మచారి, కారం పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్, మాలోతు రావూజా, నిమ్మల మధు, గొగ్గెల ఆదినారాయణ, కుంజా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మణుగూరురూరల్: మైనింగ్ అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీలోని చేపలమార్కెట్ ఏరియాలో ఉన్న స్నేహగార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అక్రమార్కులు రాత్రి సమయాల్లో తమ ఇష్టం వచ్చినట్లు ఇసుక తోలకాలు జరుపుతూ తమ జేబులు నింపుకుంటున్నారన్నారు. అధికారు దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాకు, మైనింగ్ అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు మీసాల దుర్గారావు, జిల్లా నాయకులు కామసాని మధుసూధన్, మండల అధ్యక్షుడు పట్టా బిక్షపతి, పట్టణ అధ్యక్షుడు ఈసాల వెంకటేశ్వర్లు, కిషోర్, రవీందర్, మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.